క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లికి చెందిన పెండెల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను ఎస్ఆర్ఎస్పీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల రవీందర్ పరామర్శించి, సానుభూతిని తెలిపారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు గోపగాని మొండయ్య, సమ్మెట ఐలయ్య, పెండెల రాజేశం, డ్యాగరి మల్లేష్, రాజు, కాకర్ల మహేందర్, కొండ లక్ష్మీపతి, కాసగాని కొంరయ్య, చేరాలు, రేనుకుంట్ల సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

బాలకుమారస్వామి జాతర

గంగారం: మండలంలోని మడగూడెం, కిష్టాపురం గ్రామాలలో నిర్వహించే చుంచ వారి ఇలవేల్పుల బాలకుమారస్వామి జాతర ఆదివారం రెండో రోజు అంగరంగ వైభంగా నిర్వహించారు. ఆదివారం బాలకుమారస్వామిని గద్దెలపై నిలిపి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గంగ స్నానం ఆచరించారు. రాత్రి 2గంటలకు గుడి మెలుగుట కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీమ కుమారుడు చుంచ రాజశేఖర్, పెద్దవడ్డెలు పెండకట్ల వంశీయులు, పడిగ వడ్డెలు యాప వంశీయులు, తలపతులు చుంచ వంశీయులు, రావుల వంశీయులు జాతరను కొనసాగించడం ఆనవాయితీ.

తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని టీబీసీ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్చ్ బిషప్ ఆర్.విక్రంపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో గల టీబీసీ కార్యాలయంలో సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బిషప్ విక్రంపాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్లో త్వరలో తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ సమావేశం జరగనుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీబీసీ కమిటీలు ఏర్పాటు చేసి వారి సలహా సూచనల మేరకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా ఉండేవిధంగా టీబీసీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బిషప్ మల్సూర్ నాయక్, సంయుక్త కార్యదర్శి బిషప్ జి.ఏసుపాదం, కోశాధికారి బిషప్ డేవిడ్ రాజు, జిల్లా అధ్యక్షుడు బిషప్ ఇశ్రాయేలు, జిల్లా సంయుక్త కార్యదర్శి బిషప్ లాల్ సింగ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలలో సరైన సౌకర్యాలను కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సహాయపడడానికి ఆశవర్కర్లు ఉన్నప్పటికీ, పురుష దివ్యాంగులు వచ్చినప్పుడు, వారిని వీల్చైర్ నుంచి లేపడానికి మహిళా ఆశవర్కర్లకు ఇబ్బందిగా ఉంటుందని, పురుష దివ్యాంగులకు సహాయం అందించే విధంగా పురుష సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు ధరావత్ బద్రి నాయక్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి గుండం ఆలయం ముస్తాబు



కొత్తగూడ: మహాశివరాత్రి పర్వదినం కోసం మండలంలోని గుండం శివాలయం సిద్ధమవుతోంది. పాకాల సరస్సును గుండంపల్లి గ్రామ శివారు ఆనుకుని పచ్చటి అభయారణ్యంలో కాకతీయ మహారాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆదరణ లేకపోయినా స్థానికులు దాతల సహకారంతో ఆలయాన్ని కొద్దికొద్దిగా అభివృద్ధి చేసుకుంటు వస్తున్నారు. కొత్తగూడ, నర్సంపేట, ఖానాపూర్ మండలాల నుంచి భక్తులు మహాశివరాత్రి రోజు అధిక సంఖ్యలో గుండం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

విద్యుత్ కిట్ల అందజేత

మహబూబాబాద్ రూరల్: విద్యుత్ కార్మికులకు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ కార్మికులకు టపారియా కిట్, పోల్ ఎక్కడానికి సేఫ్టీ బెల్ట్ భద్రత, ఇతర భద్రత సామాన్ల కిట్లను ఆదివారం అందజేశారు. డివిజనల్ ఇంజనీర్ పెరుమాళ్లపల్లి విజయకుమార్ సారథ్యంలో ఏడీఈ ప్రశాంత్ విద్యుత్ కార్మికులకు పంపిణీ చేశారు.

కాలి బూడిదైన ఇళ్లు (ఫైల్)



మొరుమూరు వద్ద..



కొప్పుసూరు వద్ద..



నిప్పు.. ముప్పు

- అడవుల్లో చెలరేగుతున్న మంటలు
- అగ్గి అంటుకుంటే బుగ్గే
- జాడలేని అగ్నిమాపక కేంద్రం
- ఫైర్ ఇంజన్ భద్రాచలం, ములుగు నుంచి రావాల్సిందే..
- ఆలస్యంతో పెరుగుతున్న ప్రమాద తీవ్రత

వాజేడు: వేసవి కాలం వచ్చిందంటే ఏజెన్సీలో ఎప్పుడు ఎక్కడ అగ్ని ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అందుకు కారణం ఏజెన్సీలో ఎక్కువగా పూరిల్లు కావడంతో అగ్ని ప్రమాదం జరిగితే సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలే పరిస్థితి. వెంకటాపురం(కె) సబ్ డివిజన్లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు 25 ఏళ్ల క్రితమే అడుగులు పడ్డా.. నేటి వరకు ఆ ఊసే లేదు. ప్రతీ ఏడాది వేసవి కాలంలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో పలు చోట్ల ఇళ్లు, కార్చిచ్చు వల్ల అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వెంకటాపురం(కె) మండలంలోని ఆలుబాకలో గతంలో వరుసగా రెండు సంవత్సరాలు జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ సంఖ్యలో ఇళ్లు కాలి బూడిదయ్యాయి. భద్రాచలం అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పే లోగా తీవ్రనష్టం జరిగింది. ఈ రెండు మండలాల్లో అగ్నికి ఇళ్లు ఆహుతి అవుతున్న సమాచారం అందుకుని ఘటనా స్థలానికి ఫైరింజన్ చేరుకునే లోగా బూడిద మాత్రమే మిగులుతుంది. దానికి కారణం భద్రాచలం నుంచి వాజేడు 120, వెంకటాపురం(కె) 100 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ములుగు నుంచి వాజేడుకు 90, వెంకటాపురం(కె) 110 కిలో మీటర్ల దూరంలో ఉంటాయి.

జాడ లేని అగ్నిమాపక కేంద్రం

వెంకటాపురం(కె) కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి 25 ఏళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కసరత్తులు చేశారు. త్వరలోనే ఏర్పాటు చేస్తారని ఆశించిన ప్రజలకు బంగపాటు మిగిలింది. అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉండాలని భావించినా ఇంత వరకు ఆచరణలోకి రాలేదు. వేసవి కాలం కావడంతో అడవులు, గుట్టలు ఇప్పటికే కాలి పోతున్నాయి. వాటిని ఆర్పేందుకు ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో భారీ నష్టం వాటిల్లుతుంది. జన, జంతు జాలాలకు ఉపయోగపడాల్సిన అడవులు, గుట్టలు అగ్నికి ఆహుతి అవుతున్నా కళ్లప్పగించి చూడటం తప్ప.. రక్షించుకునే మార్గం లేకుండా పోతుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల నుంచే ఎండలు మండుతుండటంతో ఏ సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. రెండు మండలాల్లో అగ్ని ప్రమాదాల కారణంగా ఆస్తులను కోల్పోతున్నామని ప్రమాదం జరిగినప్పుడు కొంతలో కొంత కాపాడుకునే అవకాశం లేకుండా పోతుందని ఇక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వెంకటాపురం(కె) కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలను తీసుకోవాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

మంటలు చెలరేగితే ఇబ్బందే..



రాత్రి సమయంలో మంటలు చెలరేగితే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అందుబాటులో అగ్నిమాపక కేంద్రం ఉంటే బాగుండు. ప్రభుత్వం వెంకటాపురం(కె) కేంద్రంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి.

– బత్తుల శ్రీనివాసరావు, మొరుమూరు కాలనీ

ఫిబ్రవరిలో 5చోట్ల చెలరేగిన మంటలు

- కడేకల్ గ్రామ సమీపంలో ఫిబ్రవరి 15న పొలాల్లో మంటలు చెలరేగడంతో గ్రామంలోకి రాకుండా అటవీశాఖ సిబ్బంది ఆర్పారు.
- ఫిబ్రవరి 16న పెనుగోలు గుట్టలపై మంటలు చెలరేగడంతో ఫైర్ పాయింట్స్ ద్వారా గుర్తించిన అటవీశాఖ సిబ్బంది అక్కడికి వెళ్లే ప్రయత్నం చేసి మధ్యలోనే నేరేడు బండ వద్ద మంటలను ఆర్పి కిందకు వచ్చారు.
- ఫిబ్రవరి 17న కొంగాల గుట్టలపై చెలరేగిన మంటలను ఆర్పారు.
- ఫిబ్రవరి 21 రోజున కొప్పుసూరు గ్రామం వద్ద మంటలు చెలరేగి గ్రామం వైపు దూసుకొస్తున్న సమయంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆర్పారు.
- ఫిబ్రవరి 22 శనివారం మొరుమూరు గ్రామ పంచాయతీ సమీపంలో పొలాల్లో చెలరేగిన మంటలు గ్రామం వైపుకు వస్తుండగా గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది ఆరు గంటల పాటు శ్రమించి ఆర్పారు.

అంధకారంలో గ్రామదేవత గుడి



చిమ్మచీకట్లో ఉన్న గుడి

గోవిందరావుపేట: గోవిందరావుపేట గ్రామంలోని గ్రామ దేవత పోషమ్మ గుడి గతకొద్ది రోజులుగా అంధకారంలో ఉంటుంది. మండల కేంద్ర శివారులో ఉన్న పోషమ్మ గుడికి నిత్యం భక్తులు వస్తుంటారు. మేడారం వెళ్లే భక్తులు పోషమ్మ గుడి దగ్గర మొక్కులు చెల్లించుకుంటారు. పోషమ్మ గుడిలో విడిది చేయడానికైనా, సేద తీరడానికైనా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. పోషమ్మ గుడి చుట్టూ చెత్త చెదారం పేరుకుపోయింది. శివారు ప్రాంతం కాబట్టి పాములు, తేళ్లతో భక్తులకు ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికైనా పోషమ్మ గుడిలో విద్యుత్దీపాలు ఏర్పాటు చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలి

- ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు



సమ్మయ్యను పరామర్శిస్తున్న జేఏసీ నాయకులు

వెంకటాపురం(కె): అమాయక గిరిజన ఆదివాసీలపై దాడికి పాల్పడిన అటవీ శాఖ అధికారులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నాయకులు కొర్స నర్సింహమూర్తి, ఉయిక శంకర్, పూనెం సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారుల దాడిలో గాయాలపాలైన ఉకన్నగూడెం గ్రామానికి చెందిన కోరం సమ్మయ్యను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవికి వెళ్లిన ఆదివాసీలపై జరిగిన దాడిలో సమ్మయ్య మూడు పక్కటెముకలు విరిగేలా అత్యంత పాశవికంగా దుశ్చర్యకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. అటవీ అధికారులు తరచుగా ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమ్మయ్య కుటుంబానికి పరిహారంగా రూ.10లక్షలు ఇవ్వాలని, చర్ల రేంజ్ అటవీ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగని పక్షంలో మానవహక్కుల కమిషన్కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, ఏఎస్ఎస్ మండల అధ్యక్షుడు కుంజ మహేష్, వాసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమార్ సేవలు కాంగ్రెస్ పార్టీ మరువదు

- మంత్రి సీతక్క



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: నల్లెల కుమార్ సేవలను కాంగ్రెస్ పార్టీ ఏనాటికీ మరువదని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల రెండో వర్ధంతి సందర్భంగా ములుగు జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుమార్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. సర్పంచ్, ఎంపీపీ, జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం ప్రజల సమస్యలు తీర్చుకుంటూ కాలం గడిపారని గుర్తు చేశారు. పేదల కోసం నిలబడిన వ్యక్తిగా చిరస్థాయిలో నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, నల్లెల కుమారుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ను గెలిపించాలి



మాట్లాడుతున్న పురుషోత్తంరావు

ములుగు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ను గెలిపించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తంరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ములుగు జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూల రవీందర్ గెలుపు బహుజన కులాల ఉద్యమాలకు దిక్సూచి కావాలని అన్నారు. రాజీ పడుతూ చేసిన ఉద్యమాలకు ఇక ముందు చరమగీతం పాడాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందనిఆ అన్నారు. సమావేశంలో గండ్రత్ విజయాకర్, నల్లెల భరత్, గుండ భిక్షపతి, పొడాల ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్రెడ్డిని ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాటారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శనగర్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు. పట్టభద్రలను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్రెడ్డికి ఓటు వేసి ఆదరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ బలపర్చిన నరేందర్రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ అధ్యక్షుడు చీటూరి మహేశ్, నాయకులు ఆత్మకూరి కుమార్ యాదవ్, సింగిరెడ్డి మధుకర్రెడ్డి, చిలువేరి రూపేశ్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సరోత్తం రెడ్డికి తొలి ప్రాధాన్యతనివ్వండి



వాజేడు: త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఆదివారం మండలంలో పలువురు ఉపాధ్యాయులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద జగపతి కోరారు. ఆయన వెంట కృష్ణమూర్తి, సోమరాజు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: వరంగల్, ఖమ్మం, నల్గొండ, ఎమ్మెల్సీ టీచర్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆపార్టీ నాయకులు దొంగల రాజేందర్ ఉపాధ్యాయులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం భూపాలపల్లి పట్టణ కేంద్రంలో జవహర్ నగర్ కాలనీ, సుభాస్ కాలనీ, కృష్ణ కాలనీలో టీచర్ల ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరే సుధాకర్, నాంపల్లి కుమార్, తాటికంటి రవికుమార్, బూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిచయ వేదికతో అనుకూల సంబంధాలు

- విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రాచారి

భూపాలపల్లి రూరల్: సమాజంలో మారుతున్న పరిణామాలకు యువతకు అనుకూలమైన వివాహ సంబంధాలను ఎంచుకునేందుకు ఏర్పాటు చేసిన పరిచయ వేదికను వినియోగించుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రాచారి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ మిత్ర కళాశాలలో ఏర్పాటు చేసిన పరిచయవేదిక కార్యక్రమానికి రవీంద్రాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఈవివాహ పరిచయ వేదికలో 70 మంది వధూవరులు వారి పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రామగిరి సదానందం, కట్ట రామచంద్ర మూర్తి, బెతోజు భారత్ కుమార్, నవీన్ కుమార్, తిరుమలచారి, శంకర మూర్తి, రాజేశ్, సాంబమూర్తి, రమేశ్, రవీంద్రా చారి పాల్గొన్నారు.

ఆలయం



ఆలయంలో లక్ష్మీనారాయణుడు, సూర్యభగవానుడు, రాముడు



శివలింగం, నందీశ్వరుడు



పట్టింపేది..?

- అభివృద్ధికి నోచుకోని పురాతన శివాలయం
- శిథిలావస్థకు చేరుతున్న వైనం

రేగొండ: చుట్టూ పంటపొలాలు.. మధ్యలో కాకతీయుల కాలంలో రాతిస్తంభాలతో నిర్మించిన శివాలయం. నాటి కాలంలో ఇక్కడ కొలువైన శివుడు ఎంతటి పూజలందుకున్నాడో తెలియదు.. కానీ.. ప్రస్తుతం ఏళ్ల తరబడి ఈ కోవెల ఆదరణకు నోచుకోక వెల వెలబోతోంది. శైవం, వైష్ణవం ఒకే చోట కొలువైన అరుదైన ఆలయాన్ని నిత్యం ప్రజలు దర్శించుకునేలా అభివృద్ధి చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు లేకపోవడం శోచనీయం. గత ప్రభుత్వం చారిత్రక కట్టడాలను పరిరక్షించాలనే ఆలోచన చేసింది. కానీ, అది రామప్ప ఆలయం నుంచి పది కిలోమీటర్ల పరిధిలోని కట్టడాలకే పరిమితం చేశారు. దీంతో ఈ ఆలయాన్ని ప్రతి ఏడాది ప్రజలే స్వచ్ఛందంగా శివరాత్రికి శుభ్రం చేసి, ఏర్పాట్లు చేసి పూజలు చేస్తున్నారు.

ఐదవ శతాబ్దపు చారిత్రక సంపద

మండల కేంద్రంలోని గడిపల్లి గ్రామంలో ఈ అరుదైన చారిత్రక ఆలయం ఉన్నది. ఈ ఆలయాన్ని ఐదవ శతాబ్దంలో కాకతీయులు నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయులు శైవారాదన చేసే క్రమంలో కొన్ని చోట్ల వైష్ణవ దేవుళ్లను పూజించారు. అందుకే ఈ ఆలయంలో శివలింగం, నంది, రాముడు, సూర్యభగవానుడు, లక్ష్మీ నారాయణుడు, హనుమంతుడు విగ్రహాలు దర్శనం ఇస్తున్నాయి.

చారిత్రక కట్టడాలని రక్షించేనా..?

గత ప్రభుత్వం చారిత్రక కట్టడాలను రక్షించాలని నిర్ణయం చేసింది. రామప్ప ఆలయం చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కాకతీయుల కాలంనాటి ఆలయాలు అభివృద్ధి చేయాలని ప్రొటెక్షన్ మాన్యుమెంట్స్ జాబితాలో చేర్చారు. కానీ పది కిలోమీటర్ల అవతల ఉన్న ఇలాంటి ఆలయాలకు ఆ జాబితాలో లేకుండా పోయింది.ఈ నెల 26న శివరాత్రి వేడుకలు ఉన్నందున కనీస వసతులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం, అధికారులు పట్టించుకుని అరుదైన ఆలయాన్ని చారిత్రక కట్టడాల రక్షణ జాబితాలో చేర్చి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దృష్టి సారించాలి



ఈ శివాలయం పునర్నిర్మాణంపై పాలకులతోపాటు ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్ తరాలకు కాకతీయుల చరిత్రను వివరించేలా కృషి చేయాలి. మహాశివరాత్రి వేడుకలకే కాకుండా నిత్యం పూజలు నిర్వహించేలా అర్చకుడిని అందుబాటులో ఉంచాలి.

– గోగుల చంద్రాకర్రెడ్డి, గడిపల్లి

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



వందల ఏళ్ల చరిత్ర గల శివాలయం రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతోంది. చరిత్రకు ఆనవాళ్లుగా మండలంలో ఉన్న ఏకైక ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– మాదగాని నరేశ్, రేగొండ

ఇరవై ఏళ్ల తర్వాత కలిశారు..



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

- కాటారంలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాటారం: కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్లో 2004–05 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇరువై సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని మధుర స్మృతులను నెమరేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. రోజంతా ఉత్సాహంగా గడిపి తమ ఆలోచనలను పంచుకున్నారు. చదువుకున్న రోజుల్లో స్నేహితులతో ఎలా ఉండేవారో గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడ ఉన్నారో ఒకరికొకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం రాజేశ్వర్రావు, ఉపాధ్యాయులు గాయత్రి, షరనైరోజ్, జీవన్ రెడ్డి, యేసుదాస్, మధు, రఘు, శ్రీనివాస్, రమేశ్, విద్యార్థులు రవిశంకర్, మహేశ్, మజహర్, సుధాకర్, కరుణాకర్, అశోక్, రాజశేఖర్, నరేశ్, వేణు, శ్రీదేవి, శైలజ, లక్ష్మి, సుగంధ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన పిట్టల వీరన్న ఆదివారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డిని వివరణ కోరగా వీరన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందని, తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు అందితే దర్యాప్తు చేస్తామని తెలిపారు.